క్లుప్తంగా

ఉపాధి ఏపీడీగా శ్రీనివాసరావు



రాజాం: ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాజాం ఏపీడీగా మీసాల శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన ఏపీడీ లక్ష్మీపతిరాజు బాడంగి మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లా ఉపాధి కార్యాలయం నుంచి శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉపాధి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఆరా తీశారు.

తాగునీటి బోర్ల మరమ్మతులు

రాజాం : మండలంలోని నందబలగ గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది బుధవారం బాగు చేశారు. వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా పాడైన రెండు బోర్లను పంచాయతీ నిధులతో బాగు చేయించామని సర్పంచ్ ఈశ్వరరావు చెప్పారు. గ్రామస్తులు బోర్లను జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు.

గణితంపై పట్టుసాధించాలి

తెర్లాం: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే గణితంపై పట్టుసాధించాలని విశ్రాంత ఎంఈఓ, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు మండాది సత్యనారాయణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు గణితంలో మెలకువలు బోధించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. లైబ్రేరియన్ కృష్ణమూర్తి ఉన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



బలగ లక్ష్మణరావు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బలగ లక్ష్మణరావు(47) బుధవారం మృతి చెందారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య భాగ్యవతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2007 సంవత్సరం నుంచి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. లక్ష్మణరావు మృతి విషయం తెలుసుకుని ఏపీఓ సాయిరాం, ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శంకరరావు తదితరులు గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి బాధిత కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ చేశారు. సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి సంధ్యా శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

హోంగార్డ్ మృతికి సంతాపం



ప్రకాశం అంత్యక్రియల్లో పాల్గొన్న డీఎస్పీ చక్రవర్తి

వంగర: మండలంలోని సంగాం గ్రామానికి చెందిన హోంగార్డ్ వెలగాడ ప్రకాశం మృతికి పోలీసుశాఖ సిబ్బంది నివాళులర్పించారు. సంగాంలో బుధవారం జరిగిన ప్రకాశం అంత్యక్రియల్లో డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, పలువురు పోలీసులు పాల్గొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పోలీసుశాఖ తరఫున ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



గురువు చినఅప్పలనాయుడు, ఉద్యోగులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. పాఠశాలలో 1994–95 మధ్య పదోతరగతి పూర్తిచేసిన వారంతా ఒక చోట చేరి సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. వారికి పాఠాలు బోధించిన గురువు ఉత్తరావెల్లి చినఅప్పలనాయుడుతో పాటు ఆర్మీ ఉద్యోగులు సవిరగాన సంగంనాయుడు, కోరాడ సీతారామ దొరను ఘనంగా సన్మానించారు.

19న మండల సమావేశం

సంతకవిటి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి తెలిపారు. ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



జోగిందొరవలసలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పేద ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొల్లలపేట సచివాలయం పరిధి జోగిందొరవలస, కరిందొరవలస, ఎస్.సీతారాంపురంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. అందుకే ప్రజలంతా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు.

గత ప్రభుత్వంలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలి..

ఈ ప్రభుత్వం ఎక్కడా అభివృద్ధి చేయడం లేదని ఎల్లో మీడియాల్లో టీడీపీ నాయకులు విమర్శిస్తునారని, గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. గతంలో శిలాఫలకాలు వేసి వదిలేయడం తప్ప నిర్మాణాలు జరగలేదన్నారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజలు మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రతీ గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల నిర్మాణాలు జరిగాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండల పార్టీ ప్రెసిడెంట్ శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, సర్పంచ్ కడుపుకూటి రమ్య, ఎంపీటీసీ శిష్టు లక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, దుంబురు కృష్ణ తదిరులు పాల్గొన్నారు.

నేడు పారాదిలో..

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం పారాది గ్రామంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల పరిషత్, రెవెన్యూ, సచివాలయ అధికారులంతా హాజరు కావాలని కోరారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని సత్యనారాయణపురం వార్డు సచివాలయం పరిధిలో తెలగవీధి, సాయికృష్ణానగర్, నరసింహులునాయుడు కాలనీ, విద్యానికేతన్ స్కూల్ రోడ్డు, గొరవీధి, శెట్టివారి వీధి తదితర ప్రాంతాల్లో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, ప్రభుత్వ పనితీరుపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. గ్రామ వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు గ్రామ స్థాయిలోనే వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా అని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. పొత్తులతో అధికారంకోసం అర్రులు చాస్తున్న టీడీపీకి గత ఎన్నికల్లో పట్టిన గతే పడుతుందని జోష్యం చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజారంజక పాలనను చూసి ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, దీనిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేతలు చెబుతున్న అబద్ధాలు, అసత్యాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, శాసపు వేణుగోపాలనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, గొర్లె దాలినాయుడు, కలమటి శంకర్, తోట తిరుమలరావు, కోరాడ రామినాయుడు, మున్సిపల్ ఏఈ రత్నాకర్, టీఎంసీ ఎస్వీ రత్నం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు తమరాంలో..

సంతకవిటి: మండలంలోని తమరాం సచివాలయం పరిధిలో గురువారం సాయంత్రం 5 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అధికారి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆప్తాల్మిక్ అధికారి ఎస్.వసంతరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి సారధి సచివాలయంలో బుధవారం వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని బీపీ, సుగర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. బీపీ తీవ్రస్థాయికి చేరడంతో విపరీతమైన తలనొప్పి, నిద్రలేమి, చూపు మసకబారడం, అలసట, శ్వాస ఇబ్బందులు, గుండెదడ వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. బీపీ పెరగడంతో మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి పక్షవాతం బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. పొగాకు, మద్యానికి దూరంగా ఉండాలని, మోతాదుకు మించి ఉప్పు, మైదా పదార్థాలు తీసుకోకూడదని సూచించారు.

విద్యాశాఖ నిర్ణయం హర్షణీయం

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా సత్కరించేందుకు చర్యలు చేపట్టడం హర్షణీయమని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలూరి రామకృష్ణ, చింత శ్రీధర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెరిట్ విద్యార్థులకు పతకం, సర్టిఫికెట్, ఉపాధ్యాయులకు జ్ఞాపిక, తల్లిదండ్రులకు సన్మానం వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యావ్యవస్థను మరింత ప్రోత్సహించినట్లు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముందస్తుగా ఎరువులు, విత్తనాలు

బాడంగి: రైతుభరోసా కేంద్రాల్లో ముందస్తుగా ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేస్తున్నట్లు ఏఓ కె.శిరీష తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌బీకేలకు సొంత భవనాలు ఉన్న గ్రామాల్లో ఖరీఫ్‌లో ఎరువులు కొరత లేకుండా ముందస్తుగా నిల్వ చేయనున్నట్లు చెప్పారు. రైతులు పచ్చిరొట్ట సాగుపై దృష్టిసారించాలని సూచించారు. అలాగే రైతుభరోసా రానివారు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

ఆయుర్వేద వైద్యం మేలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రేగిడి: ప్రభుత్వ ఆయుర్వేద వైద్యం ద్వారా అందిస్తున్న మందులు దీర్ఘకాలిక రోగాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేదంలో దీర్ఘకాలిక రోగాలను నయం చేసే మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉబ్బసం, మధుమేహం, కీళ్లనొప్పులు, వాత నొప్పులు తదితర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆయుర్వేద మందులు ఉచితంగా అందజేశారు.

ఉపాధి ఎఫ్‌ఏలు పని ప్రదేశంలో ఉండాలి



లింగాలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ

రేగిడి: ఉపాధి పనులు నిర్వహించే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు తప్పనిసరిగా పని ప్రదేశంలో ఉండాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, లింగాలవలస, తాటిపాడు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిపనులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు కారణంగా ఉదయం, సాయంత్రం సమయంలో పనులు చేయాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉంటే పనులు నిలుపుదల చేసి, ఇంటికి వెళ్లిపోవాలన్నారు. జాబ్ కార్డులు ఉన్నవారిని మాత్రమే పనికి అనుమతించాలని అన్నారు.

ఉపాధిపనులు పరిశీలన



రాజాం: ముద్దాడ చెరువులో పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలో కొఘరిపురం, బొద్దాం, పొగిరి, పెనుబాక గ్రామాల్లో సాగునీటి చెరువుల్లో జరుగుతున్న ఉపాధిపనులను ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఏపీడీ మీసాల శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. మస్టర్ సీట్లు పరిశీలించి, వేతనదారులతో మాట్లాడారు. ప్రతీ రోజు ఉదయాన్నే పని ప్రదేశానికి చేరుకుని, 10.30 గంటలకు పనులు నిలుపుదలచేయాలని, మధ్యాహ్నం 4 గంటల తరువాత తిరిగి పనులకు హాజరుకావాలని సూచించారు. వేసవి ఇబ్బందులు అధిగమించేలా పనులు వద్ద తాగునీటి సదుపాయం, టెంట్లు సదుపాయం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏపీఓ సాయిరాం ఉన్నారు.

నవధాన్యాల సాగుతో పంటకు పోషకాలు



నవధాన్యాల సాగు ఆవశ్యకతను వివరిస్తున్న సింహాద్రినాయుడు

తెర్లాం: నవధాన్యాల సాగుతో పంటలకు కావాల్సిన పోషకాలు అందుతాయని, వాటిని సాగు చేయడంపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని పూనువలస గ్రామంలో నవధాన్యాల ఉపయోగంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు వివిధ రకాల పంటల సాగుకు ముందు పొలంలో నవధాన్యాలను సాగు చేయాలని, ఆ విధంగా చేయడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఫలితంగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అనంతరం 30 రకాల నవధాన్యాల విత్తనాలను ప్యాకింగ్ చేసి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు భాగ్యం, రమ, రైతులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

రేగిడి: రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రకోపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఎండకు, వడగాలులు తోడుకావడంతో జనం రోడ్డుపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఉంగరాడమెట్ట బుధవారం బోసిపోయి కనిపించింది.



నిర్మానుష్యంగా ఉన్న ఉంగరాడమెట్ట

నాడు-నేడు పనులపై అసంతృప్తి



పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కమిషనర్

బొబ్బిలి: పట్టణంలోని మున్సిపల్ స్కూళ్లలో చేపట్టిన నాడు-నేడు పనుల పురోగతిపై కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆంధ్ర రత్న, ఆంధ్ర కేసరి ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల జాప్యంపై హెచ్‌ఎం, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయితీలను రైతులు వినియోగించుకోండి



తెర్లాం: వెలగవలసలో సూక్ష్మసేద్య పరికరాలను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

● ఏపీఎంఐపీ జిల్లా పీడీ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ

తెర్లాం: అర్హులైన రైతులందరికీ సూక్ష్మసేద్యానికి సంబంధించిన పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోందని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) జిల్లా పీడీ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వెలగవలసలో చేపేన ఫల్గుణరావు అనే రైతుకు చెందిన 7.50 ఎకరాల్లో వేసిన అయిల్‌ఫాం తోటలో ఏర్పాటు చేసిన బిందుసేద్యం పరికరాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 867మంది రైతులకు 892 హెక్టార్లలో పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 5ఎకరాల లోపు ఉన్న రైతులకు 90శాతం, 5 నుంచి 12 ఎకరాల లోపు ఉన్న రైతులకు 50శాతం రాయితీపై వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. తెర్లాం మండలంలో 49మంది రైతులకు బిందు సేద్యం పరికరాలను రాయితీపై అందజేశామన్నారు. పరికరాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతుజట్టు పీఎఫ్‌ఓ సందర్శన

బాడంగి: స్థానిక ఎత్తుఖానా సమీపంలో దీక్ష మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో నిర్వహిస్తున్న రైతుజట్టు పీఎఫ్‌ఓను మైక్రో ఇరిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. రైతు సంఘం సభ్యులతో మాట్లాడి పంటల సాగు, మార్కెటింగ్, యంత్రపరికరాల వినియోగం, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. రైతుజట్టు పీఎఫ్‌ఓకు అందుబాటులో ఉండేందుకు ఎరువులు, విత్తనాల లైసెన్సు ఏర్పాటు చేసేందుకు ఏఓ, మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడారు. పీఎఫ్‌ఓలకు అనుసంధాన అధికారిగా జేడీని నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఎఫ్‌ఓ డైరెక్టర్ ఈశ్వరరావు, ఏఓ మోహన్‌కృష్ణ, దీక్ష సొసైటీ సీఈఓ శాంతి ఉన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



శిక్షణ పొందుతున్న మహిళలతో ఏపీఎం, ట్రైనర్‌లు

బొబ్బిలి: మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధితో జీవనం సాగించాలని వెలుగు ఏపీఎం పీవీ స్వామి అన్నారు. వెలుగు ఆధ్వర్యంలో మహిళలకు అందిస్తున్న రెండో విడత కుట్టు శిక్షణను బుధవారం ఆయన పరిశీలించారు. భారత్ డైనమిక్ సంస్థ డీఆర్‌డీఏ ద్వారా ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణతో ఇక్కడ 30మంది మహిళలకు కటింగ్, కుట్టు, డిజైనింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి

● ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: డీఎస్పీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: విధి నిర్వహణలో అంకితభావం, ప్రజలకు అందించిన సేవలే ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన బి.మోహనరావును రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డీఎస్పీగా ఉన్నత స్థానంలో ఉన్న మోహనరావు సౌమ్యుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఇలాగే మంచి పేరు తెచ్చుకోవాలని, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం బాధ్యతలు చేపట్టాలని కొత్త డీఎస్పీ పి.శ్రీధర్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పలనాయుడు సేవలు మరువలేనివి

బాడంగి: మండలంలోని ఆకులకట్ట వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వర్గీయ తెంటు అప్పలనాయుడు పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బుధవారం నిర్వహించిన అప్పలనాయుడు పెద్దకర్మలో ఎమ్మెల్యే పాల్గొని ఆయన చిత్రపట వద్ద పూలతో నివాళులర్పించారు. అప్పలనాయుడుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అని అన్నారు. ఆయన భార్య శ్రీదేవి, కుమారుడు, కుమార్తెలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు మధుసూదనరావు, యామల శివప్రసాద్, చిన్నప్పదొర, మరడరమణ, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా నిర్మాణాలు



గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం



వెల్‌నెస్ సెంటర్ భవనం

రాజాం: మండలంలో అంతకాపల్లి గ్రామంలో గ్రామ సచివాలయ భవన సముదాయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.17.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని ఒకేచోట నిర్మిస్తున్నారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే వీటిని ప్రారంభానికి సిద్ధం చేయనున్నట్లు సర్పంచ్ వాకముల్లు చిన్నంనాయుడు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన బోధన



బాడంగిలో ప్రచారం చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పిల్లలను చేర్పాలని కోరుతూ ప్రిన్సిపాల్ వి.శంకరరావు, హెచ్‌ఎం ఎస్.త్రినాథరావు, ఉపాధ్యాయులు బుధవారం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. బాడంగి, పెదపల్లి, తెంటువలస, డొంకినవలస తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ఉన్న సౌకర్యాలు, విద్యాబోధన, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను వివరించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సత్యనారాయణ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.